

యువత వ్యసనాలకు బానిసలు కావద్దు 7లో..

మంచిర్యాల డీసీపీగా భాస్కర్ 7లో..

ముందస్తుగా ఇసుక డంప్‌లు

- వర్షాలు కురవకముందే ఇసుక తరలింపు
- గోదావరి నది పరిసరాల్లో పెద్ద ఎత్తున నిల్వలు
- అదును చూసి లారీల ద్వారా తరలింపు
- వే బిల్లు, పర్మిట్లు లేకున్నా పట్టించుకోని అధికారులు



కుందారం వద్ద గోదావరిలో ఇసుక తవ్వకాలు (ఫైల్)

జిల్లాలో అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. వర్షాకాలం సమీపిస్తున్నందున గోదావరి నదిలో నీరు చేరితే ఇసుక తవ్వకాలకు ఆటంకాలు ఏర్పడే అవకాశం ఉంది. దీంతో ముందుగానే పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా రహస్య ప్రాంతాలకు తరలించి నిల్వ చేస్తున్నారు. అదును చూసి టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎవరైనా సమాచారం ఇస్తే తప్ప అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

మంచిర్యాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి):మంచిర్యాల జిల్లాలో ఇసుక దందా జోరుగా సాగుతోంది. రోజురోజుకూ విజృంభిస్తున్న ఇసుక మాఫియా ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ యథేచ్ఛగా అక్రమ రవాణాకు పాల్పడుతోంది. నిత్యం వందలాది ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నా పట్టించుకునే వారే లేకుండాపోయారు. ఫిర్యాదులు వచ్చిన సందర్భంలో తప్ప మిగిలిన సమయాల్లో అధికారులు ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గోదావరిని గుల్ల చేస్తున్న అక్రమార్కులు

ప్రజల అవసరాల నిమిత్తం గోదావరి నది నుంచి ఇసుకను తరలించేందుకు ప్రభుత్వపరంగా రీచ్‌లు ఏర్పాటు చేశారు. ఈ రీచ్‌ల ద్వారా అధికారికంగా ఇసుకను తరలిస్తుండగా, అనధికా రికంగా అంతకంటే రెట్టింపు ఇసుక వివిధ ప్రాం తాలకు తరలిపోతోంది. ముఖ్యంగా జైపూర్, చెన్నూరు, కోటపల్లి మండలాల్లోని గోదావరిలో టీఎస్‌ఎండీసీ తరుపున ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన రీచ్‌ల నుంచి పర్మిట్లు ఉన్న లారీల ద్వారా ఇసుకను తర లించాలి. అయితే అందుకు భిన్నంగా గోదావరి నుంచి పెద్ద మొత్తం లో అక్రమ మార్గంలో ఇసుకను తరలిస్తున్నారు. వేలాల గ్రామ శివారు గుట్టల ప్రాంతంలో అక్రమ ఇసుక రాశులు అధికంగా ఉన్నాయి. ఇక్కడి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ టిప్పర్‌ను ఈ నెల 7న కిష్టాపూర్ సమీపంలో పోలీసులు పట్టుకొన్నారు. అయితే అధికారుల కళ్లు గప్పి నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లు ఇసుకను తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

పర్మిట్లు లేకుండానే రవాణా

గోదావరి నుంచి అక్రమ మార్గంలో ఇసుకను తరలిస్తున్న లారీలకు వే బిల్లులు, పర్మిట్లు లేకపోవడం గమనార్హం. ఒకే వే బిల్లుపై మూడు నాలుగు సార్లు ఇసుకను తరలిస్తున్నారన్న అభియోగాలు ఉన్నాయి. అయితే ఈ తతంగమంతా కొందరు అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గోదావరి నుంచి అక్రమంగా టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్న వ్యాపారులు ఒక్కో ట్రిప్పును రూ.30వేల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. జిల్లా నలుమూలల రవాణా చేయడంతో పాటు ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు పెద్ద మొత్తంలో గండి పడుతుండగా, వినియోగదారులు అధిక ధర చెల్లించి ఇసుకను కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎక్స్‌కావేటర్ సహాయంతో గోదావరిలో ఇసుకను తవ్వి లారీల్లో నింపుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జైపూర్, చెన్నూరు, మండలాల్లోని ఇసుకను ఆ పార్టీ నాయకులే పెద్ద మొత్తంలో అక్రమంగా తరలించుకుపోయారనే అపవాదులు ఉండేవి. కాంగ్రెస్ హయాంలో కూడా అదే తరహాలో ఇసుక అక్రమంగా తరలి పోతుండటం గమనార్హం. రెవెన్యూ, మైనింగ్‌శాఖల అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు అందినప్పుడు తప్ప ఇసుక అక్రమ రవాణా వైపు దృష్టి మళ్లించడంలేదనే ఆరోపణలున్నాయి. టిప్పర్లు, ట్రాక్టర్లు పట్టుబడ్డ సందర్భంలో జరిమానాలతో సరిపెడుతుండటంతో అక్రమ రవాణా ఆగడం లేదు.



ఇటీవల జైపూర్ పోలీసులు పట్టుకున్న ఇసుక లారీ

నిఘా ముమ్మరం చేశాం..: మైనింగ్ ఏడీ జగన్మోహన్‌రెడ్డి

అక్రమ ఇసుక రవాణా జరుగకుండా నిఘా ముమ్మరం చేశాం. నిత్యం సిబ్బంది గోదావరి పరివాహక ప్రాంతాల్లో పర్యటిస్తూ టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలించకుండా చర్యలు చేపడుతున్నాం. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలకు గత నెలలో రూ.లక్ష వరకు జరిమానా కూడా విధించాం. ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం ఇస్తే తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకుంటాం.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న వార్డు ప్రజలు

బెల్లంపల్లి, జూన్ 17: పట్టణంలోని 18వ వార్డులో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని వార్డు ప్రజలు సోమవారం విద్యుత్ ప్రజావాణిలో డీఈకి వినతిపత్రం అందించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండడంతో ప్రజలతోపాటు ఇంటర్నెట్, జిరాక్స్ షాపుల యజమానులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. శివాలయం వద్ద ఉన్న ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతుందని, సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వడ్నాల రాజేశం, కొలిపాక సత్యనారాయణ, కొండబత్తుల రామ్మోహన్, కొలిపాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి సమస్యను పరిష్కరించాలి



ఎంపీకి వినతి పత్రం అందిస్తున్న యువకులు

బెల్లంపల్లి, జూన్ 17: అశోక్‌నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యను పరిష్కరించాలని సోమవారం హైద్రాబాద్‌లో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణకు పలువురు వినతిపత్రం అందించారు. అశోక్‌నగర్ అండర్ బ్రిడ్జి సమస్యను పరిష్కరిస్తే పట్టణ ప్రజలకు రాకపోకలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కొన్నేళ్ళుగా బజార్‌ఏరియా నుంచి కాల్‌టెక్స్‌కు అశోక్‌నగర్ బ్రిడ్జి కింద నుంచి వాహనాల రాకపోకలు జరిగేవని, ఇటీవల రైల్వే అధికారులు బ్రిడ్జిని మూసివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్పందించిన ఎంపీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నట్లు తెలిపారు. లక్ష్మణ్, రంజిత్‌కుమార్, బలరాం, ఇజాజ్‌పాషా, అంజద్‌ఖాన్, సాగర్,సన్నియాదవ్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా



ఇన్సూరెన్స్ చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి, జూన్ 17: బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజలకు అందుబాటులో ఉంటానని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పట్ల ఎప్పటికప్పుడు పోరాడుతామని పేర్కొన్నారు. లింగాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త బానోత్ బలరాం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆయన కుటుంబానికి రూ.2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందించారు. జెడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, ఎంపీపీ గోమాస శ్రీనివాస్, ఎంపీటీసీ పొట్లపల్లి సుభాష్‌రావు, బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి కొమ్మెర లక్ష్మణ్, నాయకులు గణేష్‌గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ



జైపూర్, జూన్ 17: ఇటీవల మృతిచెందిన ఎస్టీపీపీ ఇంజనీర్ కిరిటీ స్మారకార్థం ఎస్టీపీపీలోని టర్బైన్ మెయింటనెన్స్ అధికారులు సోమవారం భీమారంలోని పీర్ల్ ఆఫ్ ఇండియా అనాథాశ్రమంలోని పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ప్యాడ్‌లు అందజేశారు. పిల్లలకు భోజనాలను ఏర్పాటు చేశారు. అధికారులు వేణుగోపాల్‌రావు, పంతులనాయక్, సురేష్, ప్రసాద్, రాకేష్‌మహేష్, పవర్ మేక్ అధికారులు రాజేష్, సాగర్‌మిశ్రా, వర ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, వేణుగోపాల స్వామి ఆలయంలో పూజలు

చెన్నూరు, జూన్ 17: అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. చెన్నూరు పట్టణంలో సోమవారం ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి మున్సిపల్ కమిషనర్, విద్యుత్, అటవీశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. పట్టణ సమస్యలు, డ్రైనేజీలు, తాగునీరు, తదితర వాటిపై చర్చించారు. చెన్నూరులో అభివృద్ధి పనులు త్వరగా చేపట్టి పూర్తి చేయాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులతో అప్రకటిత విద్యుత్ కోతలు లేకుండా చూడాలని, సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో కొన్ని రోడ్లకు అటవీ అనుమతులు రాక నిలిచిపోయాయని వాటి గురించి, పోడు భూముల సమస్యలపై తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అటవీ అధికారులు కృషి చేయాలన్నారు. ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

చెన్నూరు పట్టణానికి చెందిన సోలంకి శ్రీను హైద్రాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో కుటుంబీకులు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని కోరగా రూ.2 లక్షల ఎల్‌వోసీని అందజేశారు. శ్రీనుకు బ్రెయిన్‌ఆపరేషన్ నిమిత్తం ఎల్‌వోసీ అందించామన్నారు.

జైపూర్: ఇందారంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం జరిగిన బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే వివేక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: నియోజకవర్గంలో నిలిచిపోయిన పెండింగ్ పనులను పూర్తి చేయడానికి ప్రణాళికలతో ముందుకు వెళ్తామని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. మందమర్రిలో ఆయన మాట్లాడుతూ మందమర్రి, క్యాతనపల్లి, చెన్నూరు మున్సిపాలిటీల్లో నిలిచిపోయిన పనులపై నివేదికలు తెప్పించామని తెలిపారు. మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య ఉండకుండా అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకం అవినీతి మయమైందన్నారు. వేల కోట్లు ఈ పథకం ద్వారా దోచుకున్నారన్నారు. మందమర్రి మున్సిపాలిటీలో రూ.40 కోట్లతో మిషన్ భగీరథ పనులు ప్రారంభించగా ఎక్కడ కూడా తాగునీరు రావడం లేదన్నారు.

చిన్నారికి నివాళి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహిళలు

ఏసీసీ, జూన్ 17 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రాముని చెరువు కట్టపై మహిళ వాకర్స్ ఆధ్వర్యంలో ఇటీవల పెద్దపల్లి జిల్లాలో అత్యాచారం, హత్యకు గురైన చిన్నారి సహస్ర చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ బాలికపై దుశ్చర్యకు పాల్పడిన మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలు, బాలికలకు రక్షణ కల్పించేలా ప్రభుత్వం నిందితులకు కఠిన శిక్షలు విధించడంతో పాటు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్లు , మహిళలు పాల్గొన్నారు.

మోటివేషనల్ స్పీకర్‌గా సత్యనారాయణ

హాజీపూర్, జూన్ 17 : మండలంలోని నబ్బెపల్లి గ్రామానికి చెందిన వొడ్నాల సత్యనారాయణ ఇంపాక్ట్ మోటివేషనల్ స్పీకర్‌గా, ట్రైనర్‌గా సికింద్రాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సోమవారం ప్రొఫెసర్ విశ్వనాథ్ చేతుల మీదుగా సర్టిఫికెట్, బ్యాడ్జి అందుకున్నారు. మూడు నెలలుగా ఆన్‌లైన్ క్లాసులు విని రెండు రోజుల శిక్షణకు హాజరయ్యారు. ప్రొఫెసర్ మాట్లాడుతూ మోటివేషనల్ స్పీకర్‌గా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు భవిష్యత్ ప్రణాళికలపై అవగాహన కల్పించాలన్నారు. శ్యాంరాథోడ్, వాడేకర్ లక్ష్మణ్, మెంటర్స్ హైమావతి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న కలెక్టర్‌కు సన్మానం



బదిలీ అయిన కలెక్టర్ సంతోష్‌ను సన్మానిస్తున్న టీఎన్‌జీవో నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 17: మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా పనిచేసి నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీపై వెళ్లిన కలెక్టర్ బదావత్ సంతోష్‌ను సోమవారం టీఎన్‌జీవో నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి రామ్మోహన్, మల్లయ్య, బాపురావు, శ్రీనివాస్, తిరుపతి, శ్రావణ్, గోపాల్, సుమన్, సప్దర్ అలీ తదితరులు పాల్గొన్నారు. అలాగే బదిలీ అయిన కలెక్టర్ సంతోష్‌ను కలెక్టర్ రాహుల్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌లు సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఎంపీవోల సంఘం అధ్యక్షుడు బాపురావు, డీఎల్‌పీవో సప్దర్ అలీ, ఎంపీవోలు సత్యనారాయణ , నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు శ్రావణ్, సుమన్, శ్రీనివాస్, నవ్య, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- ఈద్గా, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



బెల్లంపల్లిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, మందమర్రి ఈద్గా వద్ద శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

ఏసీసీ, జూన్ 17: మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే కొత్త బట్టలు ధరించి మసీదులు, ఈద్గాలకు చేరుకుని సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇండ్లలో బంధుమిత్రులకు విందు ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు కబరస్తాన్ మసీదు, ఆండాళమ్మ కాలనీ సమీపంలోని ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఫ్లోర్‌లీడర్ అంకం నరేష్, నాయకులు ఎర్రం తిరుపతి, రవీందర్, సుధీర్, శ్రీనివాస్, గట్టయ్య, పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, కాంగ్రెస్ నాయకులు ఆండాళమ్మ కాలనీ ఈద్గా వద్దకు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణాధ్యక్షు డు తూముల నరేష్, ఓబీసీ సెల్ చైర్మన్ వడ్డే రాజమౌళి, కౌన్సిలర్‌లు బానేష్, మజీద్, నాయకులు సదానందం, కిషన్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండగను పట్టణంతో పాటు మండలంలో ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఉదయమే స్నానాలు ఆచ రించి నూతన వస్త్రాలు ధరించి ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండ ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ సీఐ దేవయ్య, ఎస్‌ఐ రమేష్‌లు బందోబస్తు నిర్వహించారు.

మందమర్రిటౌన్: మందమర్రి పట్టణంలో బక్రీద్ పండగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. సీఈ ఆర్ క్లబ్, రామన్ కాలనీ, విద్యానగర్‌లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి బక్రీద్ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ త్యాగానికి ప్రతీక బక్రీద్ అని తెలిపారు.

నస్పూర్: నస్పూర్ పట్టణంలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగను జరుపుకున్నారు. ఈద్గా, మసీద్‌లలో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీద్ వద్దకు ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు వెళ్ళి శుభాకాంక్షలురు. ఎస్సై రవికుమార్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

దండేపల్లి: ముత్యంపేట, దండేపల్లి, తాళ్ళపేట ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు బక్రీద్ వేడుకలను జరుపుకున్నారు. ఉదయం ప్రత్యేక ప్రార్థన లతో నమాజ్ చేశారు. బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎస్సై భూమేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

జైపూర్: ఇందారంలో బక్రీద్ పండగను ముస్లింలు ఘనంగా జరుపుకు న్నారు. ఉదయమే మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికి ఒకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. శ్రీరాంపూర్ సీఐ మోహన్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ శ్రీధర్, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బెల్లంపల్లి(తాండూర్): తాండూర్ మండలంలో ముస్లింలు బక్రీద్ పండగను ఘనంగా జరుపుకున్నారు. జామా మసీదులో ప్రార్థనలు చేశారు. మం డల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ ఈసా, ఎంపీటీసీ సిరంగి శంకర్, జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, సహ కార సంఘం మాజీ చైర్మన్ మురళీధర్‌రావు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మహేందర్‌రావు, దత్తాత్రేయరావు, రాజన్న, శంకర్, సత్యనారాయణ శుభాకాంక్షలు తెలిపారు.

వేమనపల్లి: వేమనపల్లి, నీల్వాయి, ముల్కలపేట గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండగను ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు. ఒకరికి ఒకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మందమర్రిరూరల్: తుర్కపల్లి, సారంగపల్లి గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల కోఆప్షన్ సభ్యుడు నసీరొద్దీన్, ఫిరోజ్ పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: మంచిర్యాల పట్టణంలో బక్రీద్ పండగను ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న మసీదులో, ఇస్లాంపురలో ఉన్న మదరసా, పురాణ మసీదులో ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికి ఒకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జామాత్ సాదిమీర్జా కమిటీ అధ్యక్షు డు హబీబ్, మహ్మద్ షకీర్ పాల్గొన్నారు.



మంచిర్యాలలో శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య

ఆశ్రమంలో పండ్లు పంపిణీ

శ్రీరాంపూర్, జూన్ 17: ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ బీనాదేవి వివాహ వార్షికోత్సవం సందర్భంగా యూనియన్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లోని శ్రీసాయి అనాథ ఆశ్రమంలో సోమవారం అల్పాహారం, పండ్లు అందజేశారు. బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జె. శంకర్ రావు, జాతీయ సభ్యుడు సిహెచ్. భీంరావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి, నాయకులు ల్యాగల శ్రీనివాస్, పేరం రమేష్, తదిరుపతి రాజు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు భవనాలు కరువు

ఇరుకు గదుల్లో నిర్వహణ

పలు పంచాయతీల్లో అర్ధాంతరంగా నిలిచిన పనులు

భీమిని, జూన్ 17: పరిపాలన సౌలభ్యం కోసం చిన్న గ్రామాలను గ్రామ పంచాయతీలుగా మార్చారు. అయితే చాలా చోట్ల గ్రామ పంచా యతీలకు సొంత భవనాలు లేవు. కొత్త పంచాయతీల్లో అద్దె భవనాలు, పాఠశాలల్లో పంచాయతీ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. మరి కొన్ని గ్రామాల్లో భవనాలు దశాబ్దాల కిందట నిర్మించడంతో శిథిలావస్థకు చేరాయి. భీమిని మండలంలో 12 పంచాయతీలు ఉండగా ఒక మల్లీడీ గ్రామ పంచాయతీకి తప్ప ఎక్కడా కూడా సొంత భవనాలు లేవు. మం డల కేంద్రంలో ఉన్న గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరింది. మండల కేంద్రంలో నూతన భవనం నిర్మిస్తున్నప్పటికీ పనులు నత్తన డకన సాగుతున్నాయి. శిథిలావస్థలో ఉన్న పాత భవనంలో కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. పంచాయతీలకు పక్కా భవనాలు లేకపోవడంతో కార్యదర్శులు కూర్చునేందుకు వసతులు లేకపోవడంతో చెట్ల కింద, కూడళ్లలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. వీగాం, భీమిని, ఖర్జిభీంపూర్ గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణ లోపంతో భవనాల పనులు నత్తనడకన సాగుతున్నాయి. లక్ష్మీపూర్ గ్రామంలో సొంత భవనం నిర్మించాల్సి ఉంది.

పిల్లర్లకే పరిమితం

భీమిని, ఖర్జిభీంపూర్ గ్రామాల్లో పంచాయతీ భవనాలు మంజూరై ఏడాది గడుస్తున్నా పనులు నిలిచిపోయాయి పనులు ముందుకు సాగక పోవడానికి బిల్లులు రాకపోవడమే కారణంగా తెలుస్తుంది.

ఇరుకు గదుల్లో నిర్వహణ

మండల కేంద్రంలో సొంత భవనం లేక పోవడంతో ఎంపీడీవో కార్యాలయం పక్కన ఇరుకు గదిలో పంచాయతీ కార్యాలయం కొనసాగిస్తున్నారు. అన్నీ గ్రామ పంచాయతీల్లో కూడా పాఠశాల భవనాలు, అద్దె గదుల్లో పంచాయతీకి సంబంధించిన సమావేశాలు నిర్వహిస్తున్నారు. గ్రామ పంచాయతీకి సంబంధించి సామగ్రి భద్రపరచడానికి సైతం కార్యదర్శులకు ఇబ్బందులు తప్పడం లేదు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు అవస్థల పాలవుతున్నారు. కనీసం అధికారులు కూర్చునేందుకు స్థలం లేకుండా పోయింది.

నిర్మాణాలు పూర్తయ్యేనా..

భీమిని, లక్ష్మీపూర్, ఖర్జిభీంపూర్, కేస్లాపూర్, వీగాం గ్రామాల్లో పక్కా భవనాల నిర్మాణం పనులు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. బిల్లులు రావడం లేదంటూ కాంట్రాక్టర్లు ఎక్కడి పనులు అక్కడే వదిలేశారు. ఇప్పటికైనా అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయాలని, భవనాలు లేని చోట కొత్తవి నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పంచలోహ విగ్రహం లభించిందని ప్రచారం


రైతు చేనులో లభ్యమైన విగ్రహం

మంచిర్యాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాసిపేట మండల కేంద్రంలో పంచలోహ విగ్రహం లభ్యమైనట్లుగా ప్రచారం జరుగుతోంది. మండల శివారు ప్రాంతానికి చెందిన ఓ రైతు వారం రోజుల కిత్రం పత్తి సాగు కోసం చేను చదును చేస్తుండగా పురాతన పంచలోహ విగ్రహం లభ్యమైనట్లు తెలుస్తోంది. ఈ విషయమై సోమవారం స్థానికంగా చర్చ జరుగుతోంది. పంచలోహ విగ్రహం ఖరీదైనది కావడంతో సదరు రైతు పూజారులతో ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం అసలు విగ్రహాన్ని దాచిపెట్టి దాని స్థానంలో నకిలీ విగ్రహం చేనులో పెట్టినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం చేనులో ఉన్న విగ్రహం మట్టితో ఉంది. అది పంచలోహ విగ్రహమా కాదా అనేది తెలియకుండ ఉంది. ఈ విషయమై కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను సంప్రదించగా, ఇంతవరకు ఎలాంటి సమాచారం లేదని, విచారణ జరుపుతామని తెలిపారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందిస్తున్న కమ్మ సేవా సమితి సభ్యులు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 17: హాజీపూర్ మండలంలోని దొనబండ గ్రామానికి చెందిన దాసరి అస్విత అనే విద్యార్థినికి కమ్మ సేవా సమితి నాయకులు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. పేద కుటుంబానికి చెందిన అస్విత బీఎస్సీ నర్సింగ్ చదువుతుండడంతో చదువుకు ఆటంకం కలగకూడదని సహాయం అందజేసినట్లు అధ్యక్షుడు వడ్డే వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. శ్రీనివాసరావు, కృష్ణమూర్తి, శ్రీహరి, రవీంద్రబాబు, సూర్యకుమార్, గంగాధర్‌రావు, హరినారాయణ పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుడికి ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందిస్తున్న మిత్రులు

జన్నారం, జూన్ 17 : జన్నారంకు చెందిన గల్ఫ్ కార్మికుడు గురిజాల రవికి గల్ఫ్ మిత్రులు సోమవారం రూ. 21,500 ఆర్థిక సహాయం అందించారు. రవికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో సహాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో భోజరాం, గంగాధర్, చందు, సత్తన్న, శ్రీనివాస్, సాయి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు బానిసలు కావద్దు


జెండా వెంకటాపూర్‌లో క్రీడా కిట్‌లు అందజేస్తున్న సీఐ, ఎస్‌ఐ, చిన్నగుడిపేటలో కిట్స్ పంపిణీ చేస్తున్న ఎస్సై

లక్షెట్టిపేటరూరల్, జూన్ 17: గ్రామీణ ప్రాంతాల యువత చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా భవిష్యత్‌పై దృష్టి సారించాలని లక్షెట్టిపేట సీఐ నరేందర్ అన్నారు. సోమవారం జెండా వెంకటాపూర్, వెంకట్రావుపేట, చందారం, హన్మంతుపల్లి గ్రామాల్లోని యువకులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో క్రీడా కిట్‌లను అందజేశారు. సీఐ మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఎస్‌ఐ చంద్రకుమార్, పాల్గొన్నారు.

దండేపల్లి: గ్రామీణ ప్రాంతాలలో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై భూమేష్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా తానిమడుగు, బెహరన్‌గూడ, రాజుగూడ, అర్జుగూడ గిరిజన గ్రామాల యువకులకు సోమవారం క్రీడా సామగ్రిని పోలీసుస్టేషన్‌లో అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ దేశ భవిష్యతుకు కేంద్ర బిందువు యువత అన్నారు. విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయిలో నిలిచి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలన్నారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పోలీసు, సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

భీమిని: యువకులు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి మార్గంలో నడిచి తమ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఎస్సై విజయ్ కుమార్ సూచించారు. రామగుండం సీపీ ఆదేశాల మేరకు పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా ఖర్జీభీంపూర్, చిన్నగుడిపేట గ్రామాల్లో సోమవారం యువతకు వాలీబాల్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యువకులు పోలీసులు పాల్గొన్నారు.

మంచిర్యాల డీసీపీగా భాస్కర్



ఏసీసీ, జూన్ 17 : రాష్ట్ర వ్యాప్తంగా పలు వురు ఐపీఎస్ అధికా రులను బదిలీ చేస్తూ చీఫ్ సెక్రెటరీ శాంతికు మారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంచిర్యాల డీసీపీగా పనిచేస్తున్న 2019 బ్యాచ్ ఐపీసీఎస్ అధికారి అశోక్‌కు మార్‌ను జగిత్యాల సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా బదిలీ చేశారు. 2008 బ్యాచ్ గ్రూప్ 1 అధికారి తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా పనిచేస్తున్న ఏ.భాస్కర్‌కు మంచిర్యాల డీసీపీగా పోస్టింగ్ ఇచ్చారు. జీవో ఆర్‌టీ నెంబర్ 843 ద్వారా చేపట్టిన ఈ బదిలీలు తక్షణమే అమలులోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి వలస కూలీ ఆత్మహత్య

జన్నారం, జూన్ 17: పురుగుల మందు తాగి వలస కూలీ ఆత్మహత్య కు పాల్పడ్డాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా నందివాడ మండల కేంద్రానికి చెందిన వెన్నెల గోపి(30) భార్య ఇద్దరు పిల్లలతో జన్నారం మండల కేంద్రానికి 2014లో వచ్చాడు. వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆరు నెలలుగా షాపు సరిగ్గా నడవకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. భార్య వెన్నెలతో వెల్డింగ్ షాపు నడవడం లేదని బాధపడ్డాడు. షాపు నడవడం లేదనే మనస్తాపంతో ఈ నెల 15న ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య బంధువైన నరేష్‌కు సమాచారం అందించడంతో నిర్మల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి అక్కడి నుంచి విజయవాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ రాజవర్ధన్ తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మూఢనమ్మకాలపై కళాజాతా

భీమారం, జూన్ 17: ప్రజలు మూఢనమ్మకాలను నమ్మవద్దని ఎస్‌ఐ రాములు పేర్కొన్నారు. సోమవారం రాత్రి ఎస్సీ కాలనీలో మూఢనమ్మకాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై కళాజాత బృందం ద్వారా అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రజలకు అనారోగ్యంగా ఉంటే ఆసుపత్రులకు వెళ్లాలని, బాల్య వివాహాలు చేయవద్దని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమైనా ఆపద వస్తే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌ఐ భూమయ్య, హెడ్ కానిస్టేబుల్ మాచర్ల ప్రజలు పాల్గొన్నారు.

సామూహిక గాయత్రి జపం

చెన్నూరు, జూన్ 17: శ్రీగాయత్రి మాత జన్మదినం సందర్భంగా పట్టణంలోని బ్రాహ్మణ సంఘం భవనంలో సోమవారం సామూహిక గాయత్రి జపం నిర్వహించారు. మొదటగా గాయత్రి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సహస్ర గాయత్రి జపం చేశారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, బ్రాహ్మణులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి


పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు, నృత్యాలు చేస్తున్న కళాకారులు

మందమర్రిటౌన్, జూన్ 17: సమాజహితమే లక్ష్యంగా పనిచేస్తున్న కళలను, కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కాంగ్రెస్ నాయకులు దుర్గం నరేష్, సొత్కు సుదర్శన్, గుడ్ల రమేష్‌లు తెలిపారు. సోమవారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో జిల్లా నృత్యకళాకారుల అసోసియేషన్, టాలెంట్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీలకు వారు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వం కళాకా రులకు పెద్దపీట వేస్తుందన్నారు. దివంగత కాకా స్మారకార్థం ఈ పోటీలు నిర్వహించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. తాము కూడా కళాకారులకు చేయూతనందిస్తామన్నారు. నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల నుంచి 300 మంది కళాకారులు హాజరయ్యారు. అసోసియేషన్, డ్యాన్స్ మాస్టర్ రాంబాబు, గోపి, లక్ష్మణ్, వసుధ, వనిత, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా మారిన పార్కు


పార్కులో పడేసిన బీరు బాటిళ్లు

ఏసీసీ, జూన్ 17: పాత మంచిర్యాల శ్రీలక్ష్మీనగర్‌లో ఉన్న మున్సిపల్ పార్కు రాత్రివేళలో మందుబాబులకు అడ్డాగా మారుతోంది. వాచ్‌మన్ లేనందున రాత్రి కొందరు యువకులు పార్కులో మద్యం సేవించడం పరిపాటిగా మారిందని స్థానికులు వాపోతున్నారు. పార్కులో ఓపెన్ జిమ్, వాచ్‌మన్ కోసం ఓ గది ఉంది. వాచ్‌మెన్ గదిని స్టోర్ రూంగా వాడుతున్నారు. గత నెలలో గది తాళం పగులగొట్టి గదిలో ఉన్న తట్టలు, పారలు, గడ్డపార, ఇతర వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. పార్కుకు వాచ్‌మన్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై వార్డు కౌన్సిలర్ బొలిశెట్టి సునీత ఇది వరకే మున్సిపల్ చైర్మన్‌కు విన్నవించారు.

లీకేజీతో తాగునీరు వృథా

శ్రీరాంపూర్, జూన్ 17: ఆర్‌కె 8 కాలనీలోని క్వార్టర్ల వద్ద ఉన్న ఓ తాగునీటి పైపు లీకేజీ కావడంతో నీరు వృథాగా పోతోంది. దీంతో భగత్‌సింగ్‌నగర్, ఆర్‌కె 8 కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. ఫిర్యాదు అందడంతో సరిచేశారు. వారం రోజుల క్రితం ఆర్‌కె 8 డిస్పెన్సరీ గోడ పక్కన ఉన్న పైపు లీకేజీ ఏర్పడింది. ఆ నీరు వృథాగా రోడ్డుపై పోతోంది. దీంతో వైద్య సిబ్బంది, కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఆ దారిన వెళ్లే వాహనదారులు, పాదచారులు సైతం బురద మీద పడుతుండడంతో ఇక్కట్లకు గురవుతున్నారు. లీకేజీని అరికట్టి నీరు వృథా పోకుండా కాపాడడంతో పాటు ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


పైపు పగిలి లీకేజీ అవుతున్న నీరు

చుక్కల దుప్పిన చంపిన ముగ్గురిపై కేసు


అటవీఅధికారుల అదుపులో నిందితులు

కాగజ్‌నగర్, జూన్ 17: కాగజ్‌నగర్ అటవీడివిజన్ పరిధిలోని వేంపల్లి అటవీప్రాంతంలో ఈనెల13న చుక్కల దుప్పిని చంపిన ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎఫ్‌ఆర్‌వో రమాదేవి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 13న వేంపల్లి అటవీ ప్రాంతంలో చుక్కల దుప్పి చంపినట్టు పక్కాగా సమాచారం అందిందన్నారు. తమ సిబ్బందితో క్షేత్ర స్థాయిలో విచారణ జరుపగా మన్నెగూడకు చెందిన నాయిని తిరుపతి, అంజి, టేకం తిరుపతి నేరం ఒప్పుకున్నట్టు వివరించారు. ఈ మేరకు సిర్పూరు(టి) కోర్టులో హాజరు పర్చగా 14రోజుల పాటు రిమాండుకు తరలించాలని జడ్జీ ఆదేశించినట్టు తెలిపారు.

జిల్లాలో మోస్తరు వర్షం

ఆసిఫాబాద్, జూన్ 17: కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. ఆసిఫాబాద్, వాంకిడి, సిర్పూర్(యు), జైనూరు మండలాల్లో ఆకాశం మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసింది.

ఆలయంలో ప్రత్యేక పూజలు

దహెగాం, జూన్ 17: మండల కేంద్రంలోని శివకేశవ ఆలయంలో సోమవారం నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లపోచమ్మ, భూలక్ష్మి, మహాలక్ష్మి విగ్రహాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు, హోమాలు నిర్వహించారు.

అనారోగ్యంతో ఐకేపీ అకౌంటెంట్ మృతి


రామలక్ష్మి(ఫైల్)

బెజ్జూరు, జూన్ 17: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న రామలక్ష్మి(35) ఆదివారంరాత్రి అనారోగ్యంతో మృతిచెందింది. రామలక్ష్మి కొంతకాలంగా వివిధ రకాల వ్యాధులతో బాధపడుతూ ఆసుపత్రిలో చుట్టు తిరిగినప్పటికీ నయం కాలేదు. రాత్రి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో భర్త నరేష్ చికిత్స కోసం కాగజ్‌నగర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి కుటుంబాన్ని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, ఐకేపీసిబ్బంది, కాంగ్రెస్ నాయకుడు శ్రీవర్ధన్ పరామర్శించారు.

కృత్రిమ కాలు ఏర్పాటుకు చేయూత

జైనూర్, జూన్ 17: మండలంలోని జామ్ని గ్రామానికి చెందిన గిత్తె నాందేవ్ సత్తుబాయి కుమారుడు గిత్తె బాలాజీ(23) ఇటీవల రోడ్డు ప్రమాదంలో కుడికాలిని కోల్పోయాడు. అతని వైద్యం కోసం సుమారు 5లక్షల రూపాయలు ఖర్చవుతాయని డాక్టర్లు చెప్పారు. వారిది అత్యంత పేద కుటుంబం. వారు ఆర్థిక భారాన్ని భరించలేని స్థితిని చూసి సాయిదీపం స్వచ్ఛంద సంస్థ చైర్మన్, జైనూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి నాగర్‌గోజు ముందుకు వచ్చారు. బాధితుడిని హైదరాబాదుకు తీసుకెళ్లి కృత్రిమ కాలిని ఏర్పాటు చేయించారు. దీంతో ఆ కుటుంబంతోపాటు గ్రామస్థుల ఆనందానికి అంతు లేకుండా పోయింది. స్వచ్ఛంద సంస్థ చైర్మన్, డాక్టరును గ్రామస్థులు, నాయకులు సోమవారం మండల కేంద్రంలో శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు.

ఘనంగా బక్రీద్ పండుగ


ఆసిఫాబాద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


వాంకిడిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్, జూన్ 17: జిల్లాలో సోమవారం బక్రీద్‌పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. జిల్లాకేంద్రంతోపాటు మండలాల్లో బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా జిల్లాకేంద్రంలోని బాబాపూర్ రోడ్డులో గల ఈద్గావద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, జడ్పీటీసీ నాగేశ్వర్‌రావు మైనార్టీలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీనాయకులు సింగిల్ విండో చైర్మన్ అలీబీన్ అహ్మద్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తారిక్, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో స్థానిక ఈద్గా కాంగ్రెస్‌పార్టీ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ రావిశ్రీనివాస్‌తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు చేరుకొని ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండలంలో కూడా పలుగ్రామాల్లో ఈద్గా ప్రాంతాల్లో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

మండలాల్లో..

వాంకిడి/బెజ్జూరు/దహెగాం/పెంచికలపేట/సిర్పూర్(యు)/సిర్పూర్(టి)/చింతలమానేపల్లి/రెబ్బెన/కెరమెరి: మండలాల్లో సోమవారం బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. వాంకిడి, గోయగాం, బెజ్జూరు మండల కేంద్రంతోపాటు ఎల్కపల్లి, మర్తిడి, కుకుడ, గోల్కొండ, దహెగాం మండలంలో బీబ్ర, మొట్లగూడ, సిర్పూర్(యు), పెంచికలపేట మండల కేంద్రం, సిర్పూర్(టి) మండల కేంద్రంలోని పాత, కొత్తఈద్గాల్లో, మండలంలోని లోనవెల్లి, వెంపల్లి, చింతలమానేపల్లి మండలంకేంద్రంతో పాటు బాబాసాగర్, గూడెం, డబ్బా, రన్‌వెల్లి, కెరమెరి మండల కేంద్రంతోపాటు ఝరి, సుర్దాపూర్ తదితర గ్రామాల్లో, రెబ్బెనలోని గోలేటి టౌన్‌షిప్‌లో ఈద్గాతోపాటు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు.


దహెగాంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు


పెంచికలపేటలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


కెరమెరిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు


కాగజ్‌నగర్ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న రావి శ్రీనివాస్

తుంగెడలో బోర్‌పనులు ప్రారంభించిన ఎంపీపీ

రెబ్బెన, జూన్ 17: మండలంలోని తుంగెడ గ్రామంలో చల్లమల్లన్న దేవాలయంలో బోర్‌పనులను ఎంపీపీ సౌందర్యఆనంద్ సోమవారం ప్రారంభించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఎంపీపీ నిధుల నుంచి బోర్‌వెల్‌కు నిధులు మంజూరు చేసినట్లు ఎంపీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, భగవాన్, తిరుపతి, ధర్మయ్య, హరీష్, తిరుపతి, గంగయ్య, నాగయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.


బోర్‌వెల్ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ సౌందర్య ఆనంద్

ఆర్టీసీ అధికారుల నిజాయితీ

● బస్సులో పోగొట్టుకున్న బంగారు పుస్తెలతాడు అప్పగింత


బాధితులకు పుస్తెలతాడు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

ఆసిఫాబాద్, జూన్ 17: ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న బంగారు పుస్తెలతాడును బాధితులకు అప్పగించి ఆర్టీసీ అధికారులు నిజాయితీ చాటుకున్నారు. ఈనెల 16న మంచిర్యాల జిల్లా కళ్యాణిఖని శాంతి నగర్ కాలనీకిచెందిన శాంబమూర్తి, లక్ష్మి దంపతులిద్దరు ఆసిఫాబాద్ డిపోకు చెందిన టీఎస్20జడ్ 0038బస్సులో మందమర్రిలో ఎక్కి బూర్గుడ స్టేజివద్ద దిగారు. బస్సు దిగిన తరువాత లక్ష్మి తన మెడలో మంగళ సూత్రం లేకపోవడాన్ని గమనించింది. బస్సులో పడిపోయిందని తెలుసుకొని వెంటనే డిపోకు వచ్చారు. కండక్టర్ ఆశన్నకు బస్సులో మంగళసూత్రం దొరకడంతో డిపోలోని ఎర్నింగ్ సెక్షన్‌లోని డీసీ-ఇకి అప్పగించారు. బాధితులు డిపో అధికారులను సంప్రదించగా వివరాలను సేకరించి ఆభరణాలు వారివే అని నిర్ధారించుకొని సోమ వారం బాధితులకు అప్పగించారు. కండక్టర్ ఆశన్న నిజాయితీని డిపో మేనేజర్ విశ్వనాథ్ ఆర్టీసీ, అధికారులు అభినందించారు. కార్యక్రమంలో డిసి-ఇ విశ్వనాత్, టిఐ-3 భారతి, ఏడీసీ బాపురావు, స్టేషన్ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



భయం గుప్పిట్లో గోంది గ్రామ ప్రజలు

కాగజ్‌నగర్, జూన్ 17: కాగజ్‌నగర్ అటవీడివిజన్ గోంది అటవీప్రాంతంలో భయం గుప్పిట్లో ప్రజలు కాలం వెళ్లదీస్తున్నారు. రెండ్రోజులుగా గ్రామసమీపంలో పులి సంచరిస్తోందని గ్రామస్థులు పేర్కొన్నారు. పులి తన పిల్లలతో ఈప్రాంతంలో ఆవాసం ఏర్పరుచుకుందన్నారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక భయం భయంగా బతుకుతున్నామని గ్రామస్థులు పేర్కొన్నారు. అటవీ శాఖ అధికారులు దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బాలిక కుటుంబానికి అండగా ఉంటాం

● మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

దహెగాం, జూన్ 17: బాధిత బాలిక కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. పెద్దపల్లి జిల్లా కాట్నపల్లి రైస్ మిల్లులో అత్యాచారం, హత్యకు గురైన చిన్నారి కుటుంబ సభ్యులను సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా చిన్నారి చిత్రపటానికి నివాళులు అర్పించి రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడికి కఠినంగా శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వం అందించే సహాయాన్ని అందించడానికి కృషి చేస్తామన్నారు. ఆయన వెంట నాయకులు రావి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వయోధికుల వేధింపుల నివారణ దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ సిటిజన్‌లు

కాగజ్‌నగర్, జూన్ 17: కాగజ్‌నగర్‌లో సోమవారం వయోధికుల వేధింపుల నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్రకార్యదర్శి మార్త సత్యనారాణ మాట్లాడుతూ వయోధికులను గౌరవించాలన్నారు. 2007 చట్టం ప్రకారం వయోధికుల హక్కులకు భంగం కలిగించరాదన్నారు. కార్యక్రమంలో సభ్యులు శివప్రసాద్, నారాయణ, కలికోటరమణయ్య, ఎల్లాగౌడ్, తూడురి ప్రకాష్, నాగేశ్వర్ రావు, పురుషోత్తం, నాగేశ్వర్ రావు, కోటేశ్వర రావు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

124కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



పట్టుకున్న నకిలీ పత్తి విత్తనాలతో ఎస్సై రాజు

దహెగాం, జూన్ 17: మండలంలోని హత్తిని గ్రామంలో సోమవారం 124 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తమకు అందిన పక్కా సమాచారం మేరకు హత్తిని గ్రామంలో దాడులు నిర్వహించగా తాళ్లపల్లి మనోజ్‌రావు ఇం ట్లో 124కిలోల నకిలీ పత్తి విత్తనాలు బండి సింహాద్రి అనేవ్యక్తి ట్రాక్టర్‌లో నింపుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్‌తోపాటు నకిలీ పత్తివిత్తనాలను స్వాధీనపర్చుకుని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఇన్‌చార్జి వ్యవసాయాధికారి రాజుల నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బండి సింహాద్రిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. వీటివిలువ రూ.3.10 లక్షలు ఉంటుందని అన్నారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి



వరలక్ష్మి(ఫైల్)

సిర్పూర్(టి), జూన్ 17: సిర్పూర్(టి) గ్రామ పంచాయతీలోని దుబ్బగూడ గ్రామ పంచాయతీకి చెందిన ఎల్ములెవరలక్ష్మి(12) సోమవారం సాయంత్రం విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. పోలీసులు, స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. వరలక్ష్మి ఇంట్లో ఆడుకుంటుండగా కూలర్ వైరు తగిలి విద్యు త్‌షాక్‌కు గురైంది. దీంతో కుటుంబసభ్యులు వెంటనే బాలికను సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తీసుకు రాగా అప్పటికే మృతి చెందింది. మృతురాలి తండ్రి గజానంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై దీకొండరమేష్ తెలిపారు.

జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి

వరించేదెవరినో?





జైనూరు మార్కెట్ కమిటీ కార్యాలయం

● తీవ్రమవుతున్న పోటీ ● జోరందుకున్న పైరవీలు

● టీడీపీ, కాంగ్రెస్ హయాంలో గిరిజనేతర

బీఆర్ఎస్ హయాంలో గిరిజన నాయకులకు పదవి

కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీకోసం కసరత్తు ప్రారంభించడంతో ఆ పదవిని ఆశించేవారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఇటీవల కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ప్రభుత్వం భర్తీ చేయడంతో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికోసం పైరవీలు జోరందుకున్నాయి. నాయకులు ఎవరికి వారు కాంగ్రెస్ పార్టీ అధినేతలను సంప్రదిస్తూ తమకు జైనూర్ మార్కెట్ కమిటీచైర్మన్ పదవి కట్టబెట్టాలని అభ్యర్థిస్తున్నట్లు తెలుస్తోంది.

- జైనూర్

జైనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఆశావహులు పోటీపడుతున్నారు. ప్రప్రథమంగా తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ కాలంలో నామిటేడ్ పదవులను గిరిజనేతరులతో భర్తీ చేశారు. దీంతో ప్రథమంగా జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి జైనూరుకు చెందిన అప్పటి టీడీపీ మండల అధ్యక్షుడు స్వర్గీయ సర్వరాజ్‌ఖాన్, కాంగ్రెస్ హయాంలో ఉట్నూరుకు షేక్ అహ్మద్‌కు అప్పగించారు. ఆ తర్వాత అదే మండలానికి చెందిన పూజారీ శివాజీని చైర్మన్ పదవి వరించింది. ఆ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నామిటేడ్ పదవులు గిరిజనే తరులకు దక్కలేదు. ఈ పదవిని గిరిజనులతోనే భర్తీ చేశారు. దీంతో గడిచిన పదేళ్ల కాలం నుంచి జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సీటు మండలంలోని జంగాంకు చెందిన కుంర భగ్వంత్ రావ్, సిర్పూర్(యు)కు చెందిన మాజీ ఎంపీపీ ఆత్రం భగ్వంత్‌రావ్‌ను వరించింది. వారి పదవీకాలం పూర్తవ్వడంతో ప్రస్తుతం ఖాళీగా ఉన్న చైర్మన్ సీటును ఎలాగైనా భర్తీ చేయాలని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆలోచిస్తున్నట్లు సమాచారం.

ఇప్పటి వరకు ఉట్నూరు, జైనూరు మండలాల నాయకులకే పదవి..

అప్పట్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ హవా ఉండటంతో అటు ఖానాపూర్, ఇటు ఆసిఫాబాద్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పెద్దగా వాటిని పట్టించుకోలేదు. ఎవరికి వచ్చినా తమ పార్టీ వారే కదా అనిపించుకున్నారు. వారు తమకు తోచిన నాయకులకు, అనుచరులకు పదవులను కట్టబెట్టారు. అదేవిధంగా జైనూరు మార్కెట్ పరిధిలో ఉట్నూరు, జైనూరు, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాలు ఉన్నాయి. ఇప్పటివరకు ఉట్నూరు, జైనూరు మండలాల నాయకులు మాత్రమే చైర్మన్ పదవులను అనుభవించారు.

మిగిలిన లింగాపూర్ మండల నాయకుల కన్ను సైతం ఈసారి జైనూర్ మార్కెట్ చైర్మన్ సీటుపై పడినట్లు చర్చ కొనసాగుతోంది. దీంతో మూడు మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయ కులు చైర్మన్ పదవికోసం ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అదేవిధంగా ఇప్పటివరకు గిరిజనేతరులు ముగ్గురు, గోండు తెగల వారు ఇద్దరేసి పదవులను అనుభవించారు.ఇంకా గిరిజనుల్లో కొలాం, అంద్, లంబాడా, పర్దాన్, థోటి తదితర కులాల వారు చైర్మన్ సీటును ఇప్పటివరకు ఆశించలేదు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల్లో కుల సమీకరణను దృష్టిలో పెట్టుకొని నామినేటెడ్ పదవులను గిరిజనులతో భర్తీ చేస్తుందా లేక తిరిగి గిరిజనేతరులతో భర్తీ చేయనుందాననే అనుమానాలు లేక పోలేదు.

రేసులో పలు మండలాల నాయకులు..

ప్రస్తుతం జైనూర్‌మార్కెట్ కమిటీ చైర్మన్ రేసులో సిర్పూర్(యు)కు చెందిన సీనియర్ నేత కుడ్మెత విశ్వనాథ్, దుర్రె సుభాష్, జైనూరు మండలానికి చెందిన సీనియర్ నాయకులు పెందుర్ ప్రకాష్, పంద్ర షేకుతోపాటు ఉట్నూరుకు చెందిన మరి కొంతమంది ఉన్నట్లు తెలుస్తోంది. అయితే జైనూరు, లింగాపూర్, సిర్పూర్(యు) మండలాలు ఆసిఫాబాద్ నియోజకవర్గం పరిధిలో ఉండగా ఉట్నూరు మండ లం ఖానాపూర్ నియోజకవర్గంలోకి వస్తుంది. చైర్మన్ పదవిని తమ నియోజకవర్గం పరిధిలోకి ఉండేలా ఇటు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అటు మంత్రి సీతక్క ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారని ప్రచారం జోరందుకోగా ఈ సారి తమకు చైర్మన్ పదవి దక్కేలా కృషి చేయాలని ఉట్నూరు మండలం నాయకులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును వేడుకుంటున్నట్లు సమాచారం. చివరకు కాంగ్రెస్ అధిష్ఠానం కృషి ఫలితంగా ఏ నియోజక వర్గం ఖాతాలోకి చైర్మన్ పదవి వచ్చి పడుతుందో వేచి చూడాలి మరి.

ఇద్దరు పిల్లలను ఒడ్డుకు చేర్చి.. అనంతలోకాలకు

● ప్రమాదవశాత్తు నీటిలో పడిన కూతురు
● ఆమెను కాపాడేందుకు దూకిన తండ్రి, తమ్ముడు
● గట్టువరకు ఇద్దరిని తీసుకువచ్చి ప్రాణాలొదిన తండ్రి





విజయ్‌కుమార్(ఫైల్), భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య ప్రశాంతి, కుటుంబ సభ్యులు

తిమ్మాపూర్, జూన్ 17: సెలవు రోజు అని సరదాగా గుడికి వెళ్లిన ఓ కుటుంబం తిరిగి ఇంటికి వస్తూ మధ్యలో దిగువమానేరు డ్యాం పైకి వెళ్లారు. నీళ్లను చూస్తు జాలీగా గడుపుతుండగా విధి వెక్కిరించింది. నీటిని చూస్తున్న క్రమంలో కూతురు ప్రమాదవశాత్తు నీటిలో పడగా ఆమెను కాపాడేందుకు తండ్రి, తమ్ముడు నీటిలోకి దూకారు. ఈ ప్రయత్నంలో తండ్రి తన ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాదసంఘటన కరీంనగర్ జిల్లా పరిధిలోని దిగువ మానేరు జలాశయం వద్ద సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు, ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో అసిస్టెంట్ పేఅండ్ అకౌంట్స్ (వర్క్‌అండ్‌ప్రాజెక్టు) డిపార్ట్‌మెంట్‌లో సూపరిండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న బంగారి విజయ్‌కుమార్(47)తన కుటుంబంతో కలిసి కరీంనగర్‌లోని సంతోష్ నగర్‌లో నివాసముంటున్నాడు. విజయ్ కుమార్‌కు భార్య ప్రశాంతి, కూతురు సాయి నిత్య(18) బీటెక్ ప్రథమ సంవత్సరం, కూమరుడు విక్రాంత్(14), 10వ తరగతి చదువుతున్నారు. సోమవారం సెలవుదినం కావడంతో కుటుంబంతోపాటు తనఅత్త అయిన పుష్పలతతో కలిసి విజయ్‌కుమార్ ఉదయం 9గంటల సమయంలో తనకారులో హుస్నాబాద్‌లోని పొట్లపల్లిలో గల శివాలయానికి చేరుకున్నారు. అక్కడ దేవుడిని దర్శించుకొని ఇంటికి తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయాన్ని సందర్శించేం దుకు వెళ్లారు. మధ్యాహ్నం 12.30గంటల సమయంలో కాకతీయ మెయిన్ కెనాల్ దిగువకు నీటిని విడుదలచేసే రెగ్యూలేటరీ వద్దకు చేరుకున్నారు. ఈక్రమంలో రెగ్యూలేటరీ సమీపంలో ఉన్న స్టాండింగ్ పాయింట్ వద్ద నీటి వద్దకు వెళ్లి నీళ్లను చూస్తున్న కూతురు సాయినిత్య ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడిపోయింది. దీంతో సాయి నిత్యను కాపాడేందుకు తండ్రి విజయ్‌కుమార్ నీటిలో దూకాడు. వీళ్లను చూసిన కుమారుడు విక్రాంత్ కూడా నీళ్లలోకి దూకాడు. కూతురు సాయినిత్యతోపాటు కుమారుడు విక్రాంత్‌ను నీటిలో నుంచి విజయ్‌కుమార్ గట్టు వైపుకు నెట్టుకుంటూ వస్తుండగా భార్య ప్రశాంతి కాపాడండి అంటూ గట్టిగా కేకలు వేసింది. సమీపంలో చేపల వేట కొసం వచ్చిన శంకర్ అనేజాలరీ గమనించి వెంటనే వారివద్దకు వెళ్లి పిల్లలను బయటకు తీసుకువచ్చి కాపాడాడు. కానీ విజయ్‌కుమార్ మాత్రం ఇద్దరిని కాపాడేందుకు శ్రమించి నీటిలో మునిగిమృతిచెందాడు. నీటిలో నుంచి ఇద్దరు పిల్లలను ప్రాణాలతో బయటకు తీసి విజయ్‌కుమార్ మృతిచెందడంతో భార్య ప్రశాంతి, కూతురు, కుమారుడు, అత్త సంఘటన స్థలం వద్ద రోదనాలు మిన్నంటాయి. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ ఎస్సై చేరాలు మృతదేహన్ని కరీం నగర్‌లోని ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై చేరాలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను ఓదార్చారు.

జిల్లా ఎస్పీగా డీవీ శ్రీనివాసరావు

● ఎస్పీ సురేష్‌కుమార్ బదిలీ



డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, జూన్ 17: జిల్లా ఎస్పీగా డీవీ శ్రీనివాసరావును నియమిస్తూ సోమవారం రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఐపీఎస్‌ల బదిలీలలో భాగంగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మేడ్చల్ ట్రాఫిక్‌డీసీపీగా పనిచేస్తున్న శ్రీనివాసరావును జిల్లా ఎస్పీగా బదిలీ చేసింది. ఇక్కడ ఎస్పీగా పని చేస్తున్న కె సురేష్‌కుమార్‌ను సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ డీసీపీగా బదిలీచేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది.

కాగజ్‌నగర్ మార్కెట్‌కమిటీ కార్యవర్గం ప్రమాణస్వీకారం



మాజీఎమ్మెల్యేతో మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు

కాగజ్‌నగర్, జూన్ 17: కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా సుద్దాల దేవయ్య, వైస్‌చైర్మన్‌గా వార్ల తిరుపతి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు మాట్లాడుతూ నూతన కార్యవర్గ కమిటీ మార్కెట్‌కమిటీ అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. అనంతరం కొత్తగా ఎంపికైన సభ్యులను ఘనంగా సన్మానించారు.

అభినందించిన మాజీ ఎమ్మెల్యే..

నూతనంగా ఎన్నికైన కాగజ్‌నగర్ మార్కెట్‌కమిటీ చైర్మన్ సుద్దాల దేవయ్య, వైస్‌చైర్మన్ వార్ల తిరుపతిని సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అభినందించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రావిశ్రీనివాస్‌తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచాలి: జీఎం



కేకే ఓసీపీని పరిశీలిస్తున్న జీఎం మనోహర్

మందమర్రిటౌన్, జూన్ 17: ఏరియాలో ఈ ఆర్థిక సంవత్సరం నిర్ధేశించిన ఉత్పత్తి లక్ష్యాల పెంపుదలకు కార్మికులు, అధికారులు కృషి చేయాలని మందమర్రి జీఎం మనోహర్ తెలిపారు. సోమవారం ఏరియాలోని కేకే ఓసీపీని ఆయన సందర్శించారు. ఉత్పత్తినిపరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు రక్షణతో కూడిన ఉత్పత్తే ప్రధానలక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రతిరోజు ఉద్యోగులు అధికారులు తేడా లేకుండా రక్షణ సూత్రాలు పాటిస్తూ పనులను చేయాలన్నారు. అంతకుముందు ఓసీపీప్లాన్‌లను పరిశీలించారు. రోజువారి ఉత్పత్తిలక్ష్యాలను ప్రాజెక్టుఆఫీసర్ రమేష్‌ను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టుఇంజనీర్ సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈపీ ఆపరేటర్ ట్రైనీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మందమర్రిటౌన్, జూన్ 17: మందమర్రి, బెల్లంపల్లి ఏరియా ఈపీ ఆపరేటర్ ట్రైనీ డ్రైవింగ్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఏరియా జీఎం మనోహర్ తెలిపారు. సోమవారం సింగరేణి పాఠశాల మైదానంలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల18,19 తేదీల్లో పరీక్షలు ఉంటాయన్నారు. పారదర్శకంగా ఎంపిక ఉంటుందన్నారు. డ్రైవింగ్ చేసేటప్పటి నుంచి వాహనం ఆపేవరకు వీడియో చిత్రీకరణ చేస్తామన్నారు. పకడ్బందీగా పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పీఎం శ్యాంసుందర్, ఏఐటీయూసీ బ్రాంచీ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, అధికారులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: ఈపీ ఆపరేటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం నుంచి 21వతేదీ వరకు జరుగనున్న ప్రాక్టికల్ పరీక్షల ఏర్పాట్లను ప్రగతిమైదానంలో ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. అభ్యర్థుల హాల్ టికెట్లు, ఐడి కార్డులను తనిఖీచేసి ధ్రువీకరించుకున్న తర్వాతనే పరీక్షలకు అనుమతించాలన్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకొని తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అంబులెన్స్ అందుబాటులో ఉంచాలన్నారు.

సింగరేణి ఐటీ విభాగానికి అవార్డు



ఉద్యోగులను అభినందిస్తున్న సీఎండీ బలరాం

శ్రీరాంపూర్, జూన్ 17: సింగరేణి ఐటీ విభాగానికి ఎంటర్‌ప్రైజెస్ అప్లికేషన్ అనే కేటగిరీలో జాతీయస్థాయి అవార్డు లభించింది. ఈ అవార్డును ఎక్స్‌ప్రెస్ కంప్యూటర్ అనేసంస్థ ద్వారా ఆదివారం రాత్రి రాజస్థాన్‌లోని జైపూర్‌లో సింగరేణి అధికారులకు అందించారు. జీఎం(కోఆర్డినేషన్) జి దేవేందర్, ప్రాజెక్ట్ మేనేజర్(ఐటీ) హరప్రసాద్, డిప్యూటీ జీఎం(ఐటీ) హరిశంకర్, మేనేజర్(ఐటీ) రామలక్ష్మయ్యను సింగరేణి సీఎండీ ఎన్ బలరాం సోమవారం హైదరా బాద్‌లోని తన కార్యాలయంలో అభినందించారు. అనంతరం మాట్లాడుతూ, ఐటీవిభాగం ఆధ్వర్యంలో సింగరేణి ఉద్యోగులకు సమాచారం తోపాటు వారికి పలుసేవలు అందిస్తున్నామని తెలిపారు. ఎంప్లాయీస్ పర్సనల్ ఇన్ఫర్మేషన్ సిస్టం ద్వారా సమాచారాన్ని పొందుపర్చుతున్నామన్నారు. దేశంలోని అన్ని బొగ్గు కంపెనీల్లో ఎస్ఆర్‌పిఎస్ (ఎంటర్ ప్రైజెస్ రిసోర్స్ ప్లానింగ్ సాఫ్ట్‌వేర్)ను అమలుచేస్తున్న మొదటికంపెనీగా సింగరేణి గుర్తింపు పొందిందన్నారు. అనతికాలంలోనే సంస్థను పేపర్‌లెస్ కంపెనీగా రూపు దిద్దుతామన్నారు.

బొగ్గు బ్లాకులు సింగరేణికే ఇవ్వాలి : సీఐటీయూ

శ్రీరాంపూర్, జూన్ 17: సింగరేణి తవ్వకాలు జరిపిన బొగ్గు బ్లాకులు సింగరేణికే ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్‌లోని ఆర్‌కె న్యూటెక్, ఇందారం1ఎ గనుల కార్మికులు ఆయనను హైదరాబాద్‌లో కలిసి పలుసమస్యలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ, పలు ప్రసారమాధ్యమాల ద్వారా సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేస్తారని తెలుస్తోందని, దీనివల్ల కొన్ని కోట్ల రూపాయలు పెట్టి తవ్వకాలు చేపట్టిన సింగరేణి నష్టపోయి ప్రైవేటు వ్యక్తులు లాభపడతారన్నారు. ఇది సింగరేణి మనుగడకే ప్రమాదం ఏర్పడి కార్మికులు ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కేంద్ర బొగ్గుశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న కిషన్‌రెడ్డి సింగరేణిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బొగ్గు బ్లాకులను టెండర్ లేకుండా నామినేషన్‌పద్ధతిలో సింగరేణికి కేటాయించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు హైపవర్‌కమిటీ వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు గుల్ల బాలాజీ, అంబాల శ్రీనివాస్, నాయకులు కస్తూరి చంద్రశేఖర్, నరహరి, శ్రీనివాస్, సదానందం, ప్రతాప్, పుల్లారావు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ చిట్టీలు ఇవ్వడంలో జాప్యం వద్దు

మందమర్రిటౌన్, జూన్ 17: సింగరేణి ఉద్యోగులకు ప్రతినెల వారి వేతనాల నుంచి రికవరీ చేసే సీఎంపీఎఫ్ చిట్టీలు రెండు సంవత్సరాలుగా ఇవ్వకపోవడం సరికాదని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎంపీఎఫ్ చిట్టీలు సకాలంలో ఇప్పించేలా చర్యలు తీసుకోవాల్సిన గుర్తింపు సంఘం ఏఐటీయూసీ మందమర్రికి సంబంధించి జీఎం కార్యాలయం సిబ్బందిని బాధ్యులను చేయడం సరైంది కాదన్నారు. గుర్తింపు సంఘం ఇప్పటికైనా యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి సీఎంపీఎఫ్ చిట్టీలు ఇచ్చేలా కృషి చేయాలన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెంచండి

శ్రీరాంపూర్, జూన్ 17: తమకు పెన్షన్ పెంచాలని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఏఐటీయుసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బి జనక్ ప్రసాద్‌తో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఆయా సమస్యలను సింగరేణి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని యూనియన్ నాయకులు హామీ ఇచ్చారు. సమావేశంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రామచందర్ రావు, ఉప ప్రధానకార్యదర్శి అళవందార్ వేణుమాధవ్, కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కెఆర్‌సి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూమి సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్

బెజ్జూరు, జూన్ 17: వివాదం ఉన్న భూముల్లో సర్వేలు చేపట్టి హద్దులు ఏర్పాటు చేయాలని సిర్పూర్ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. సోమ వారం మండలంలోని మర్తిడి శివారులోని సలుగుపల్లి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మర్తిడిశివారులో ఓభూమి వివాదాస్ప దంగా ఉందన్నారు. రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. ఈ విషయమై తహసీల్దార్‌తో మాట్లాడి పూర్తిస్థాయిలో సర్వే చేపట్టి హద్దులు ఏర్పాటు చేసేలా కృషిచేస్తామన్నారు. భూమికి సంబంధించిన వ్యక్తులను కూర్చోబెట్టి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో భూకబ్జాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. భూమి విషయంలో పలువురిపై పోలీసులు కేసులుపెట్టడం సరికాదన్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. ఆయనవెంట నాయ కులు బషరత్‌ఖాన్, లక్ష్మీనారాయణ, రమేష్, పెంటయ్య, శంకర్ ఉన్నారు.

అధ్వానంగా రోడ్డు



గుంతలు పడి అధ్వానంగా దహెగాం- కాగజ్‌నగర్ రోడ్డు

దహెగాం, జూన్ 17: మండలంలోని ఇట్యాల గ్రామంలో బీటీరోడ్డు వర్షం పడితే అధ్వాన్నంగా తయారవుతోంది. దీంతో ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగజ్‌నగర్-దహెగాం మండలాల మధ్య రెండు వరుసల బీటీరహదారిపై గుంతలు ఏర్పడి ఎప్పుడు నీరు నిలిచి తీవ్రఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. అదే విధంగా ఇట్యాల- భీమిని వెళ్లే బీటీ రోడ్డు గుంతలు పడి కంకరతేలి నడవడానికి సైతం ఇబ్బందిగా ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.